క్లుప్తంగా

కోదండ రామాలయంలో విశేష పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

పెద్దపంజాణి: మండలంలోని రాయలపేట గ్రామంలో కొలువుదీరిన శ్రీకోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు శుక్రవారం ఉదయం విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సుందరంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం శేష వాహనంపై ఊరేగించారు.

కుంభార్లపల్లెలో ఆధార్ కేంద్రం



వి.కోట: మండలంలోని కుంభార్లపల్లె సచివాలయంలో ఆధార్ నమోదు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించినట్లు సర్పంచ్ సుభాష్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఎలాంటి వ్యయప్రయాసలకు లోనుకాకుండా గ్రామంలోనే సేవలు పొందవచ్చని తెలిపారు. లయన్స్‌క్లబ్ మండల అధ్యక్షుడు సురేంద్రగౌడ్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి వితరణ



రొంపిచెర్ల: రొంపిచెర్ల ఆదర్శ పాఠశాలలో పది తరగతి విద్యార్థులు 47 మందికి జెడ్పీటీసీ రెడ్డిశ్వర్‌రెడ్డి పరీక్ష సామగ్రిని శుక్రవారం వితరణగా అందజేశారు. అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు తదితరాలను అందజేశారు. ప్రిన్సిపాల్ సరళ, పాఠశాల కమిటీ చైర్మన్ మీనాక్షి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బార్ అధ్యక్షుడిగా శివశంకర్‌నాయుడు





శివశంకర్‌నాయుడు ఆనందకుమార్(కార్యదర్శి)

పుంగనూరు: పుంగనూరు న్యాయవాదుల సంఘ(బార్) ఎన్నికలు శుక్రవారం జరిగాయి. నూతన అధ్యక్షుడిగా గల్లాశివశంకర్‌నాయుడు, కార్యదర్శిగా కేవీ ఆనంద్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా జమీల్, ట్రెజరర్‌గా శరత్‌కుమార్ ఎంపికైనట్లు ఎన్నికల అధికారులు పీఎస్.బాలాజీకుమార్, వై.భాస్కర్‌రెడ్డి తెలిపారు. అధ్యక్ష స్థానానికి ఇద్దరు పోటీ పడడంతో ఎన్నికలు జరిగాయి. 43 ఓట్లతో శివశంకర్‌నాయుడు విజయం సాధించారు. శివశంకర్‌నాయుడు మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. సమస్యల నివేదికలు సిద్ధం చేసి మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిలను కలిసి అందజేస్తామన్నారు. నూతన కార్యవర్గ సభ్యులను న్యాయవాదులు అభినందించారు.

ప్రొఫెసర్ సత్యవతికి సన్మానం



సత్యవతిని సన్మానిస్తున్న రిజిస్ట్రార్ వేణుగోపాల్

కుప్పం: ద్రవిడ వర్సిటీ లాంగ్వేజ్ టీచింగ్ టెక్నాలజీ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నా ఆచార్య సత్యవాణి ఉద్యోగ విరమణ సందర్భంగా సిబ్బంది సన్మానించారు. శుక్రవారం వర్సిటీ పరిపాలన భవనంలో రిజిస్ట్రార్ వేణుగోపాల్ రెడ్డి ఆమెను సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అధ్యాపకురాలిగా, సాహితీ వేత్తగా ఆమె సేవలను కొనియాడారు రెక్టార్ అనురాధ, మహిళా అధ్యాపకులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్



నిందితుడి అరెస్ట్ చూపుతున్న ఎస్‌ఐ

చౌడేపల్లె: కర్ణాటక మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ చౌడేపల్లె మండలం గడ్డంవారి పల్లె పంచాయతీ బత్తలాపురానికి చెందిన టి.సుధాకర్ ఏ.కొత్తకోట క్రాసు వద్ద మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈమేరకు దాడి చేసి, అతన్ని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. 30 ప్యాకెట్ల కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి రిమాండుకు ఆదేశించినట్లు పేర్కొన్నారు.

దేశానికే ఆదర్శం సంక్షేమ పాలన

- చెప్పిన హామీలే కాదు.. అడగనవీ జగనన్న ఇచ్చారు
- మహిళల అభివృద్ధితోనే సమాజాభివృద్ధి
- డ్వాక్రా మహిళలను దగా చేసిన చంద్రబాబు
- ఆసరాలో సభలో ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ వాసులు



సీఎం చిత్రపటానికి మహిళల పాలాభిషేకం, చిత్రంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే వెంకటేగౌడ

పలమనేరు: తమది టీడీపీలా డబ్బా కొట్టే ప్రభుత్వం కాదని.. దేశానికే ఆదర్శంగా నిలిచేలా అన్ని వర్గాలకు మేలు చేసే సంక్షేమ ప్రభుత్వమని జెడ్పీ ఎమ్మెల్యే వెంకటేగౌడ, చైర్మన్ శ్రీనివాసులు పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శుక్రవారం పలమనేరు మండల వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ సభ జరిగింది. వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలసి జ్యోతిప్రజ్వలన చేసి వారు కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహిళలు సీఎం చిత్రపటానికి పాలాభిషేకాన్ని చేశారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో గెలవాలనే దురాశతో చంద్రబాబు డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తామని, ఎవరూ బ్యాంకులో అప్పులు కట్టవద్దని ప్రకటించారని తెలిపారు. చంద్రబాబు మాట నమ్మిన మహిళలు రుణాలను కట్టక పోగా వడ్డీ పెరిగి ఖాతాలు బ్లాక్‌లో పడ్డాయన్నారు. తీరా అధికారంలోకి వచ్చాక డ్వాక్రా మహిళలకు మొండిచేయి చూపి, మళ్లీ ఎన్నికల కోసం పసుపు కుంకుమ డ్రామాకు తెరతీశారన్నారు. చంద్రబాబు నైజాన్ని పసిగట్టిన మహిళలు మొన్నటి ఎన్నికల్లో ఆయనకు తగిన బుద్ధి చెప్పారని తెలిపారు. జగనన్న పాదయాత్రలో మహిళలకు కన్నీటి కష్టాలను తెలుసుకుని సీఎం కాగానే నాలుగు విడతల్లో ఆర్థికసాయం చేసేలా వైఎస్సార్ ఆసరా ద్వారా వారిని ఆదుకుంటున్నారని పేర్కొన్నారు. కోవిడ్ సమయంలో జనం ప్రాణాలు పోతున్నా చంద్రబాబు హైదరాబాద్‌లో అద్దాలమేడలో దాక్కున్నాడే తప్ప జనంలోకి రాలేదని విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ఈ ప్రభుత్వం షెడ్యూల్ మేరకు మ్యానిఫెస్టోను అమలుచేస్తూ, చెప్పని హామీలను సైతం అమలు చేస్తోందన్నారు. జగనన్న పాలనలో అన్నివర్గాలకు మేలు జరుగుతుంటేనే మళ్లీ ఆదరించాలని ధైర్యంగా అడుగుతున్నామని తెలిపారు. గతంలో ఇక్కడ గెలిచిన ఏ ఎమ్మెల్యే అయినా ఇంటికీ వచ్చి సమస్యలను తెలుసుకున్నారా అని ప్రజలు ఆలోచించాలన్నారు.

మూడో విడత రూ.5.36 కోట్ల లబ్ధి

డీఆర్‌డీఏ బ్యాంకు లింకేజీ యాంకర్ పర్సన్ నాగేశ్వరావు మాట్లాడుతూ పలమనేరు మండలానికి సంబంధించి 656 మహిళా సంఘాల్లో 5,860మంది సభ్యులున్నారన్నారు. వీరికి రూ.21.42 కోట్లు అప్పుగా ఉందన్నారు. ఇందులో వైఎస్సార్ ఆసరా కింద తొలివిడతగా రూ.5.34కోట్లు, రెండో విడతలో రూ. 5.41కోట్లను వారి ఖాతాల్లోకి జమచేశారన్నారు. ప్రస్తుతం మూడో విడతలో భాగంగా రూ.5.36కోట్లను అందిస్తున్నట్టు తెలిపారు. మూడో విడతలో కలిపి మొత్తం రూ.16.10 కోట్లను అందించామన్నారు. అనంతరం మెగా చెక్కును ఆవిష్కరించారు. ఏఎంసీ చైర్మెన్ హేమంత్‌కుమార్ రెడ్డి, ఎంపీపీ రోజా, జెడ్పీటీసీ సభ్యురాలు మల్లిక, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బాలాజీనాయుడు, రాష్ట్ర కార్య దర్శి రంగన్న, సర్పంచుల సంఘం అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, వైస్ ఎంపీపీలు జయశ్రీ, గజేంద్ర, వెలుగు ఏసీ హరి, పీఏసీఎస్ చైర్మెన్ రాజారెడ్డి, ఆస్పత్రి చైర్మెన్ చెంగారెడ్డి, ఆత్మా చెర్మెన్ గోవిందురెడ్డి, ఎంపీడీవో విద్యాసాగర్, తహసీల్దార్ కుప్పుస్వామి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ మెంబర్లు పాల్గొన్నారు.



ఆసరా సభకు హాజరైన మహిళలు

ఆకట్టుకున్న స్టాళ్లు

మండలంలో 5, 860మంది గ్రూపు సభ్యులు ఉండగా 5వేల మందికి పైగా సభకు హాజరైయ్యారు. దీనిపై కార్యక్రమ నిర్వాహకులు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బాలాజీనాయుడును జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే అభినందించారు. మహిళలకు ప్రత్యేక కృతజ్ఞతలను తెలిపారు. సభ వద్ద వివిధశాఖలు ఏర్పాటు చేసిన పోషన్‌పక్వాడా, మిల్లెట్ మహోత్సవ్ లాంటివి ఆకట్టుకున్నాయి.

మహిళా సాధికారతే లక్ష్యం



ఆసరా చెక్కుల పంపిణీ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ భరత్

- కుప్పంపై చంద్రబాబు కపట ప్రేమ
- కరోనా సమయంలో నా తండ్రి చనిపోయినా నేను కుప్పంలోనే ఉన్నా
- వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీలో ఎమ్మెల్సీ భరత్



హాజరైన మహిళలు

రామకుప్పం: మహిళా సాధికారతే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ బాలుర హైస్కూల్ ప్రాంగణంలో శుక్రవారం వైఎస్సార్ ఆసరా సంబరాల కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన భరత్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల లబ్ధి నగదును నేరుగా అక్కాచెల్లెమ్మల ఖాతాల్లోకి జమ చేసి మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు సీఎం జగన్ కృషి చేస్తున్నారన్నారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధించేలా ప్రభుత్వం అన్ని విధాలా చేయూత నిస్తుందన్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజల ఇంటి వద్దకు ప్రభుత్వం వచ్చిందన్నారు. ఇలాంటి ప్రభుత్వం కావాలా? లేక దళారీ వ్యవస్థతో ప్రజలను పీడించే టీడీపీ ప్రభుత్వం కావాలో? ప్రజలు నిర్ణయించుకోవాలన్నారు.

మార్పునకు ఒక అవకాశం ఇవ్వండి

కుప్పం ప్రజలపై చంద్రబాబు నాయుడు కపట ప్రేమ చూపిస్తున్నారని, ఆయన మాటలు నమ్మవద్దని భరత్ అన్నారు. కరోనా కష్టకాలంలో కుప్పం వైపు కన్నెత్తి చూడని చంద్రబాబు,లోకేష్ మున్సిపల్ ఎన్నికల కోసం కుప్పం వీధులు తిరిగారన్నారు. కరోనా సమయంలో కుప్పం ప్రజలకు కనీస అవసరాలు కల్పించని చంద్రబాబుకు ఓటు అడిగే నైతిక హక్కు కూడా లేదని తీవ్రంగా విమర్శించారు. తన తండ్రి చంద్రమౌళి కరోనా సమయంలో చనిపోయినా తాను కుప్పంలోనే ఉంటూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించానన్నారు. 'నన్ను నమ్మండి..మార్పు కోసం ఒక అవకాశం ఇవ్వండి' అని భరత్ సభలో కోరారు. మరోసారి జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితే మరిన్ని పథకాలు అమలు చేస్తారని తెలిపారు. అనంతరం ఆసరా మూడో విడత చెక్కును మహిళలకు పంపిణీ చేశారు. మొత్తం 931 సంఘాలకు 8,447 మంది సభ్యులకు రూ.6.47 కోట్లు వారి పొదుపు ఖాతాలకు జమ చేసినట్లు వైఎస్సార్ క్రాంతిపథం ఏపీఎం లావణ్య తెలిపారు. అదేవిధంగా ఉన్నతి పథకం కింద ఎస్సీ,ఎస్టీ గ్రూపు సభ్యులు 79 మందికి రూ. 39. 72లక్షలు పంపిణీ చేసినట్లు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు రెడ్డెప్ప, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, సింగిల్‌విండో అధ్యక్షుడు వేణప్పగౌడు, పార్టీ కో కన్వీనర్ చంద్రారెడ్డి, రెస్కో డైరెక్టర్లు రవినాయక్, థామస్, నాగిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, తహసీల్దార్ మురళి, ఎంపీడీఓ రాధాకృష్ణ పాల్గొన్నారు.

స్పందన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలి



రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

గంగవరం: స్పందన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కారమయ్యేలా అధికారుల దృష్టికి తీసుకురావాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆదేశించారు. మండలంలోని కీలపట్ల గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది హాజరు పట్టిక, మూమెంట్, సీఎల్ రిజిస్టర్లతో పాటు సచివాలయ సేవలు, స్పందన, సర్వీస్ రిజిస్టర్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నవరత్నాల పథకాలు అర్హులందరికీ అందాలని ఆదేశించారు. స్పందన కార్యక్రమం తప్పనిసరిగా నిర్వహించి అర్జీలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సూచించారు.

పింగళి వెంకయ్యకు ఘన నివాళి



జాతీయ జెండాను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

పుంగనూరు: మండలంలోని పూజగానిపల్లె హైస్కూల్‌లో శుక్రవారం జాతీయజెండా రూపకర్త పింగళివెంకయ్యకు ఘన నివాళులర్పించారు. హెచ్‌ఎం రియాజున్నిసా ఆధ్వర్యంలో విద్యార్థులు జాతీయ జెండాను ప్రదర్శిస్తూ ర్యాలీ చేసి, గౌరవ వందనం చేశారు. పింగళివెంకయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ జాతీయజెండాను రూపకల్పన చేసి పింగళివెంకయ్య 1921 మార్చి 31న ఆల్‌ఇండియా కాంగ్రెస్ సమావేశంలోమహాత్మగాంధీకి అందజేశారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా దేశభక్తి గీతాలు ఆలాపించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరం పరిష్కరించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగరాజ

సోమల: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలని ఎంపీడీఓ నాగరాజ తెలిపారు. శుక్రవారం మండలంలోని అన్నెమ్మగారిపల్లె, పెద్ద ఉప్పరపల్లె సచివాలయాలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, సిబ్బంది హాజరు, బయోమెట్రిక్‌ను పరిశీలించారు. సమస్యల వినతులు పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం పెద్ద ఉప్పరపల్లె జగనన్న లేవుట్‌ను పరిశీలించి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయించాలని ఇంజినీరింగ్, హౌసింగ్ సిబ్బందికి సూచించారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ గణపతి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు జిలాని, పంచాయతీ కార్యదర్శులు మసూదా బేగం, మణికుమార్,లలిత పాల్గొన్నారు.

చిరు ధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న మోహన్

సోమల: చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో స్థానిక వెలుగు కార్యాలయంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ మాధవీలత మాట్లాడుతూ చిరుధాన్యాల్లో మంచి పోషక విలువలు ఉంటాయని అన్నారు. చిరుధాన్యాలతో చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించి, వాటి ప్రాముఖ్యతను వివరించారు. ఏపీఎం శివయ్య, వైద్యాధికారి శివప్రతాప్ పాల్గొన్నారు.

వేలం ఆదాయం రూ.3.16 లక్షలు



వేలం నిర్వహిస్తున్న ఈఓపీఆర్డీ

సోమల: మండలంలోని పెద్ద ఉప్పరపల్లె పంచాయతీకి వేలం పాట ద్వారా రూ.3.16 లక్షలు ఆదాయం వచ్చినట్లు ఎంపీడీఓ నాగరాజ, ఈఓపీఆర్డీ ఎస్‌ఏ గఫూర్ సాహెబ్ తెలిపారు. శుక్రవారం సంతగేటు, ప్రవేటు బస్టాండు గేటు నిర్వహణకు సర్పంచ్ భారతి ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు. ఈ వేలం పాటల ద్వారా రూ.3.16 లక్షలు ఆదాయం వచ్చింది. గత ఏడాదికంటే రూ.80 వేలు అధిక ఆదాయం వచ్చినట్లు వారు తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంగాధరం, నేతలు జిలాని, గణపతి, పంచాయతీ కార్యదర్శి మసూదా బేగం పాల్గొన్నారు.

మంగళంపేట పంచాయతీకి..

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని మంగళంపేట పంచాయతీకి శుక్రవారం నిర్వహించిన వారపు సంత వేలం పాట ద్వారా రూ.2.72 లక్షల ఆదాయం వచ్చింది. వారపు సంతకు రూ.2.56, ప్రవేట్ బస్టాండు గేటు రూ.16 వేలు ఆదాయం లభించింది. ఈవోపీఆర్డీ రాజశేఖర్, సర్పంచ్ మధు, పంచాయతీ కార్యదర్శి నాగరాజ పాల్గొన్నారు. ఈ నిధులను పంచాయతీ అభివృద్ధికి వినియోగించనున్నారు.

సారా స్వాధీనం-ఒకరి అరెస్టు

పులిచెర్ల(కల్లూరు): సారాను స్వాధీనం చేసు కుని ఒకరిని అరెస్టు చేసినట్లు పులిచెర్ల సెబ్ పోలీసులు తెలిపారు. వివరాలు ..కల్లూరు జెడ్పీ బంగ్లాకు ఎదురుగా ఉన్న కూల్‌డ్రింక్ షాపులో శుక్రవారం శ్రీరాములు అనే వ్యక్తి నుంచి 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. దాడుల్లో సీఐ శ్రీనివాసమూర్తి, ఎస్‌ఐ కవీశ్వరనాయుడు, హెచ్‌సీ సుధాకర్, ఈసీ మధు పాల్గొన్నారు. ఎక్కడైనా సారా అమ్ముతున్నట్లు తెలిస్తే ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు.

పది పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ లీలారాణి

పలమనేరు: మండలంలో పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్టు ఎంఈవో లీలారాణి తెలిపారు. మండిపేట కోటూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఆమె పాల్గొని పదో తరగతి విద్యార్థులకు తగు సూచనలు ఇచ్చారు. మండలంలో ఆరు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 1,327 మంది పరీక్షలకు హాజరు కానున్నారని, కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను కల్పించినట్లు తెలిపారు.

రేపు ఆసరా పంపిణీ సమావేశం

శాంతిపురం: మండల సచివాలయం వద్ద ఆదివారం వైఎస్సార్ ఆసరా మూడవ విడత పంపిణీ సమావేశం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ భరత్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, డ్వాక్రా మహిళలు హాజరు కావాలని కోరారు. మండలంలోని వెయ్యి గ్రూపులకు చెందిన 8,680 మంది లబ్ధిదారులకు రూ 9.71 కోట్లు ఆసరా ద్వారా లబ్ధి చేకూరుతోందన్నారు.

1వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు

పుంగనూరు: పేద విద్యార్థులు ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలలో 25 శాతం ఉచిత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చని ఎంఈవో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 10 వరకు 1వ తరగతి ప్రవేశానికి తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. వివరాలకు పాఠశాలల్లో సంప్రదించాలన్నారు.

అంకితభావంతో పనిచేయాలి



డైరీలను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్

చౌడేపల్లె: సచివాలయ సర్వేయర్లు అంకితభావంతో విధులు నిర్వహించాలని తహసీల్దార్ మాధవరాజు సూచించారు. శుక్రవారం ఎస్‌ఈఏ ముద్రించిన సర్వేయర్ల యూనియన్ డైరీలను తహసీల్దార్ ఆవిష్కరించారు. ఆర్‌ఐ సుధాకర్ నాయక్, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఘర్షణ- పలువురికి గాయాలు

సోమల: మండలంలోని కందూరు పంచాయతీ మిట్టపల్లెలో గురువారం రాత్రి జరిగిన ఘర్షణలో పలువురు గాయపడ్డారు. పోలీసుల కథనం.. మిట్టపల్లెకు చెందిన ఒక వర్గానికి చెందిన రాధ, రవిచంద్రన్, రేవంత్ కుమార్, మోహన్‌రెడ్డి, రెండవ వర్గానికి చెందిన జ్యోతిరెడ్డి, యశ్వంత్‌రెడ్డి, హరిష్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి పాతకక్షలు మనసులో పెట్టుకొని కట్టెలు, రాళ్లు, రాడ్లతో దాడులకు పాల్పడ్డారు. ఈ ఘర్షణలో గాయపడిన ఓ వర్గం వారు పీలేరు ప్రభుత్వ ఆస్పత్రిలో, మరోక వర్గం వారు పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్చార్జి ఎస్‌ఐ మారుతి శుక్రవారం తెలిపారు.

జూదరుల అరెస్ట్

చౌడేపల్లె: పేకాట ఆడుతున్న ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రవికుమార్ శుక్రవారం తెలిపారు. పుదిపట్ల పంచాయతీ మిట్టూరు పొలాల్లో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేశామని పేర్కొన్నారు. ఐదుగురిని అరెస్టు చేసి, రూ.23,150 స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిత



కుప్పం రూరల్: విద్యార్థినులతో అతిథులు



పులిచెర్ల: వీడ్కోలు కార్యక్రమం

పులిచెర్ల(కల్లూరు): చదువుతోనే ప్రతి ఒక్కరికీ ఉజ్వల భవిషత్తు ఉంటుందని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. మండలంలోని కావేటిగారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ చదువే నిజమైన ఆస్తి అని తెలిపారు. ఎంఈఓ సిద్దరామయ్య, నాగరాజ ప్రసాద్, రామ్మూర్తి, కేశవరెడ్డిపాల్గొన్నారు.

పట్టుదలతో చదవాలి

సోమల: పట్టుదలతో చదివితే అనుకున్నది సాధించవచ్చని ఎంపీపీ ఈశ్వరయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని చెన్నయ్యగారిపల్లె ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవంలో ఆయన పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పూర్వ విద్యార్థిని హేమలత విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు, సచివాలయ మండల కన్వీనర్ రాశెట్టి మధు, వైస్ ఎంపీపీ ప్రభాకర,హెచ్‌ఎం గాయత్రి పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలి

కుప్పంరూరల్: విద్యార్థులు కష్టపడి చదవి ఉన్నత శిఖరాలను అధిరోహించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని నడుమూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేంద్రన్ అన్నారు. శుక్రవారం పాఠశాల వార్షికోత్సవం, 10వ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ, తల్లిదండ్రులు ఎంతో కష్టపడి, ఎన్నో ఆశలతో బడులకు పంపుతారని, వారి ఆశలను వమ్ము చేయకుండా బాగా చదవాలన్నారు. 10వ తరగతి విద్యార్థులకు శాంతిపురానికి చెందిన గిరి అట్టలు, పెన్నులను వితరణగా అందించారు. అతిథులు సంతోష్, మణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయితీ దాణా పంపిణీ



దాణాను పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

సోమల: ప్రభుత్వం నుంచి రాయితీపై వచ్చిన మిశ్రమ దాణాను శుక్రవారం పాడి రైతులకు ఎంపీపీ ఈశ్వరయ్య, ఏఎంసీ మాజీ చైర్మన్లు అమాస మోహన్, నాగేశ్వరరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి చందనప్రియ మాట్లాడుతూ.. రైతు భరోసా కేంద్రాల ద్వారా రూ.3160 వేల విలువ చేసే 200 కేజీల మిశ్రమ దాణాను రాయితీపై రూ.1300లకు అందిస్తున్నట్లు తెలిపారు. 26 మెట్రిక్ టన్నుల దాణా పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ దాణా పశువులకు మేతగా వేస్తే అధిక పాల దిగుబడితో పాటు పశువులకు మంచి పోషక విలువలు అందుతాయన్నారు. ఇంకా రైతులకు ఎవరికైనా దాణా కావాలంటే ఆర్బీకేల్లోని పశువైద్య సిబ్బందిని సంప్రదించాలని తెలిపారు. వైస్ ఎంపీపీ ప్రభాకర, వైఎస్సార్‌సీపీ నేతలు వరదం వెంకటరమణ, రమణయ్య, సిబ్బంది తేజ, సుధాకర్ పాల్గొన్నారు.

అభివృద్ధిపై ఇంటింటి ప్రచారం



మంగళంపేటలో ఇంటింటి ప్రచారంలో నాయకులు

పులిచెర్ల(కల్లూరు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధిని వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మంగళంపేట పంచాయతీలో శుక్రవారం పర్యటిస్తూ ఎవరెవరికి ఎంతెంత లబ్ధి చేకూరిందో అంకెలతో సహా వివరించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని ఆదరించాలని, మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయితే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందడంతోపాటు మరిన్ని సంక్షేమ పథకాలు అమలవుతాయన్నారు. సచివాలయాల కన్వీనరు ముర్వత్‌బాషా, మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు నాగరాజ ప్రసాద్, సర్పంచ్ మధు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి రాయల్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రొంపిచెర్లలో రెండు పరీక్ష కేంద్రాలు

రొంపిచెర్ల: మండలంలో పదవ తరగతి పరీక్షలకు రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఎంఈవో హసన్‌బాషా శుక్రవారం తెలిపారు. మండలంలో 8 ప్రభుత్వ, ప్రవేటు పాఠశాలల్లో 279 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. వీరికి రొంపిచెర్ల బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బాలుర ఉన్నత పాఠశాలలో 8 గదులలో 163 మంది, బాలికల ఉన్నత పాఠశాలలో 5 గదుల్లో 116 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. 13 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్ష జరిగే సమయంలో పట్టణంలోని అన్ని జిరాక్స్ షాపులు మూసి వేయాలని తెలిపారు.

నిరుద్యోగులకు ఉపాధి కోర్సుల్లో శిక్షణ

పలమనేరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్కిల్ హబ్‌లో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ యువకులకు డేటా ఎంట్రీ ఆపరేటర్, బ్యూటీషియన్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చి ఆపై ప్రైవేటు రంగంలో ఉపాధిని కల్పించనున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. టెన్త్ నుంచి పీజీ వరకు చదివి, 18 నుంచి 35 ఏళ్ల లోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పేర్ల రిజిస్ట్రేషన్లకు ఏప్రిల్ మూడో తేదీ చివరి గడువని తెలిపారు.